నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 నిజామాబాద్, సోమవారం 6 మే 2024 NIZAMABAD

## నేడు ఇందూరుకు
# గులాబీ దళపతి

నగరంలో కేసీఆర్ బస్సు యాత్ర

- నెహ్రూ చౌక్ వద్ద రోడ్‌షో
- భారీగా తరలిరానున్న ప్రజానీకం...
- ఏర్పాట్లు పూర్తిచేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు...
- లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పార్టీ అధినేత
- ఆసక్తిగా ఎదురు చూస్తున్న జిల్లా వాసులు






నగరంలో రోడ్‌షో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి వేముల, మాజీ ఎమ్మెల్యే బిగాల తదితరులు




నిజామాబాద్, మే 5, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు (సోమవారం) ఇందూరుకు రానున్నారు. కేసీఆర్ బస్సు యాత్ర నేడు జిల్లాకు చేరుకోనున్నది. గులాబీ దళపతి కోసం ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ శ్రీకారం చుట్టిన బస్సు యాత్ర పెను సంచలనం సృష్టిస్తోంది. తండోపతండాలుగా తరలివస్తున్న జనంతో బస్సు యాత్ర, రోడ్‌షో దద్దరిల్లుతోంది. జనాల రాకతో రోడ్లన్నీ జనమయం కావడంతోపాటు కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వినేందుకు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత తొలిసారి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వస్తున్న గులాబీ బాస్‌కు నిజామాబాద్ ప్రజలంతా ఘనంగా స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో కేసీఆర్ టూర్ రెండు రోజుల పాటు కొనసాగుతుండగా .. తొలిరోజు కార్యక్రమం జగిత్యాలలో ఆదివారం దిగ్విజయంగా పూర్తయ్యింది. నేడు జిల్లా కేంద్రంలోని నిర్వహించే రోడ్ షో సైతం అంతకు మించిన జనంతో మారు మోగనున్నదని బీఆర్‌ఎస్ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. బీఆర్‌ఎస్‌నుంచి నిజామాబాద్ లోక్‌సభకు పోటీ చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం కేసీఆర్ ప్రచారానికి వస్తుండడంతో కాంగ్రెస్, బీజేపీలో వణుకు మొదలైంది.

**నెహ్రూ చౌక్ వద్ద ప్రసంగం...**

జగిత్యాల నుంచి కేసీఆర్ సోమవారం సాయంత్రం నిజామాబాద్‌కు పయనం అవుతారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30గంటల వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు,. రోడ్‌షో, బస్సు యాత్రలో భాగంగా నెహ్రూ చౌక్ వద్ద కేసీఆర్ కీలక ఉపన్యాసం చేయనున్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ తరపున అక్కడే ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 5.35 గంటలకు ఎన్టీఆర్ చౌరస్తా, పాత కలెక్టరేట్ నుంచి బస్సు యాత్రగా కేసీఆర్ ముందుకు కదులుతూ వెళ్తారు. పాత కలెక్టరేట్, తిలక్ గార్డెన్, ఖలీల్‌వాడి, ప్రభుత్వ జనరల్ దవాఖాన, బాపూజీ వచనాలయం మీదుగా గాంధీ చౌక్ నుంచి నెహ్రూ చౌక్ వరకు బస్సు యాత్ర కొనసాగుతుంది. జిల్లా కేంద్రంలో కేసీఆర్ బస్సు యాత్ర కోసం ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రేవంత్ రెడ్డి సర్కారుపై కేసీఆర్ సంధిస్తోన్న వ్యాఖ్యలు, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పడుతున్న గోస, మోసపోయిన ప్రజల బాధలను కేసీఆర్ ఉటంకిస్తుండడంతో పాటు భరోసాను కల్పిస్తున్న తీరును స్వయంగా వినేందుకు జనాలంతా తరలిరానున్నారు. పదేండ్ల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సకల జనులకు అండగా నిలిచిన కేసీఆర్ ఇప్పుడు కూడా అదే స్థాయిలో అండగా ఉంటూ కాంగ్రెస్ మెడలు వంచి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రయత్నించనున్నారు. ఇందుకోసం కేసీఆర్‌కు మద్దతు తెలియజేసేందుకు ఇందూరువాసులు కేసీఆర్‌కు జై కొట్టేందుకు సిద్ధం అవుతున్నారు.

**బిగాల ఇంట్లో బస...**

పర్యటనలో భాగంగా సాయంత్రం నిజామాబాద్‌కు కేసీఆర్ రావడంతోనే బస్సు యాత్ర ద్వారా ప్రజలను కలుస్తారు. దారిపొడవునా జనాలకు అభివాదం చేస్తూ ముందుకు కదులుతారు. తదనంతరం ఎన్నికల నియమావళి ప్రకారం రాత్రి 10గంటల్లోపే ఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని రాత్రికి నిజామాబాద్‌లోనే కేసీఆర్ బస చేస్తారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నివాసంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. మరుసటి రోజు మంగళవారం నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నాయకులతో ప్రత్యేకంగా భేటీ అవుతారు. గులాబీ శ్రేణులు, నాయకత్వంతో సమీక్షలు నిర్వహిస్తారు. లోక్‌సభ పోరులో బీఆర్‌ఎస్ విజయమే లక్ష్యంగా శ్రేణులకు గులాబీ బాస్ దిశా నిర్దేశనం చేయనున్నారు. మంగళవారం సాయంత్రం కామారెడ్డిలో నిర్వహించే బస్సు యాత్రలో పాల్గొనేందుకు కేసీఆర్ బయల్దేరుతారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కామారెడ్డి ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి రాత్రికి మెదక్ జిల్లాకు కేసీఆర్ చేరుకుంటారు.

## పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి**

ఖలీల్‌వాడి, మే 5 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు (సోమవారం)ఇందూరుకు నేపథ్యంలో ఆయన పర్యటన వివరాలను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, బోధన్, బాల్కొం డ, ఆర్మూర్, జగిత్యాల్, కోరుట్ల నియోజకవర్గాల ప్రజలు, బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ మూడు నియోజకవర్గాల నుంచి వచ్చే కార్యకర్తలు, ప్రజలు పాత కలెక్టరేట్ గ్రౌండ్, ఇరిగేషన్ వాటర్స్ ఓల్డ్ కలెక్టరేట్ ఆఫీస్, ఆర్టీసీ ఎల్లమ్మగుట్ట వద్ద వాహనాలను నిలుపుకోవచ్చని తెలిపారు.బోధన్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల నుంచి వచ్చే వారు ఐటీఐ గ్రౌండ్, శైలజ గ్రౌండ్‌లో వాహనాలు నిలుపుకోవాలని సూచించారు.

**ప్రతి ఒక్కరూ దీవించండి : బాజిరెడ్డి**

లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం కేసీఆర్ వస్తున్నారని, బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు, అభిమానులు తరలిరావాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఎలా నష్టపోతుందో ప్రజలకు వివరించడానికి కేసీఆర్ వస్తున్నారని పేర్కొన్నారు.

**రైతులను మోసం చేసిన కాంగ్రెస్**

**ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు**

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసంచేసిందన్నారు. పంటలకు నీళ్లు లేక ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారిని పట్టించుకునే పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని మండిపడ్డారు. ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆ పార్టీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకుడు బాజిరెడ్డి జగన్, జడ్పీటీసీలు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేముల, పక్కన సురేశ్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, బిగాల, వీజీ గౌడ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తదితరులు

## ప్రభుత్వ డాక్టర్ల కోడ్ ఉల్లంఘన!

- బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేతో ప్రత్యేక భేటీ...
- మీట్ విత్ డాక్టర్స్ పేరుతో అర్వింద్ సమావేశం

అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తాతో ఐఎంఏ బృందం.. చిత్రంలో పలువురు ప్రభుత్వ డాక్టర్లు







మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్

నిజామాబాద్, మే 5, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ఎంతో బాధ్యతగా ఉండాల్సి ఉంటుంది. విధుల దుర్వినియోగానికి దూరంగా ఉండడంతోపాటు రాజకీయ కార్యకలాపాల్లో సర్కారు ద్వారా జీతం తీసుకుంటున్న వారెవ్వరూ పాలు పంచుకోవద్దు. కానీ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఐఎంఏ సమావేశం ఇప్పుడు తీవ్ర రాద్ధాంతానికి దారి తీస్తోంది. ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ద్వారా మీట్ విత్ డాక్టర్స్ పేరుతో బీజేపీ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రత్యేకంగా ఓ ప్రైవేటు హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. గుట్టు చప్పుడు కాకుండా మీడియాకు ఈ భేటీకి సంబంధించిన లీకులు బయట పెట్టకుండా బీజేపీ ప్రజా ప్రతినిధులు, ఐఎంఏ బాధ్యులంతా జాగ్రత్తలు తీసుకున్నారు. తీరా ఫొటోలు బయటికి రావడంతో కొంత మంది ప్రభుత్వ వైద్యులు ఈ రాజకీయ నాయకులతో అంటకాగుతూ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భేటీలో పాల్గొనడం వివాదం రేగుతోంది. ఈ సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలోనూ నిజామాబాద్ లోక్‌సభకు పోటీ చేస్తున్న ప్రస్తుత ఎంపీ అర్వింద్‌తో మీట్ విత్ డాక్టర్స్... అంటూ ప్రదర్శించారు. ఇందులో అనేక మంది ప్రైవేటు డాక్టర్లు ఉన్నప్పటికీ అదేం వివాదం కావడం లేదు. వారి వ్యక్తిగతమైన నిర్ణయంగానే అందరూ భావిస్తున్నారు. కాకపోతే బాధ్యతాయుతమైన ప్రభుత్వ వైద్యులుగా ఉన్న వారే ఇందులో పాలు పంచుకోవడంపై చర్చ నడుస్తోంది. ప్రభుత్వ డాక్టర్లుగా విధులు నిర్వహిస్తూ ఓ పార్టీ కార్యక్రమానికి హాజరవ్వడం ఏమిటంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

**రాజకీయ నాయకులతో ప్రభుత్వ ఉద్యోగుల భేటీ కోడ్ ఉల్లంఘనే..**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ రాజకీయ నాయకులు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనరాదు. ఈసీ నిబంధనల మేరకు అలాంటి వాటికి దూరంగా ఉండాలి. అలా పాల్గొంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందికే వస్తుంది.

**- రాజీవ్ గాంధీ హన్మంతు,**
**కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి**

## బుద్దె రాజేశ్వర్ సేవలు చిరస్మరణీయం

- ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి
- సంస్మరణ సభలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బోధన్, మే 5: ప్రజల కోసం బుద్దె రాజేశ్వర్ పడిన తపన, ఆయన ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని,రాజేశ్వర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత బుద్దె రాజేశ్వర్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు బుద్దె రాజేశ్వర్ చిత్రపటానికి పోచారం శ్రీనివాసరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా తదితరులు పూలువేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో పోచారం మాట్లాడుతూ.. బుద్దె రాజేశ్వర్ అందరినీ కలుపుకునిపోయే వ్యక్తి అని, అన్ని పార్టీలకు నచ్చిన వ్యక్తి అని ఇలాంటి వారు చాలా అరుదుగా ఉంటారని అన్నారు. తనతో ఎప్పుడు మాట్లాడినా రైతులు, ప్రజల గురించి తప్ప తన వ్యక్తిగత సమస్యలు చెప్పేవారు కాదని పోచారం అన్నారు. అనంతరం బుద్దె రాజేశ్వర్ సేవలను సుదర్శన్‌రెడ్డి, మండవ కొనియాడారు. సంస్మరణ సభలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్లెపు శంకర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బుద్దె రాజేశ్వర్ స్మారకార్థం సాలూర మండలం కేంద్రంలో సాలూర యూత్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి రక్తదాన శిబిరం నిర్వహించగా.. 61 మంది దాతలు రక్తాన్ని దానం చేశారు.



ఇందూరులోని 44వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బిగాల

### జోరుగా ఎన్నికల ప్రచారం..

బాన్సువాడ, మే 5 : బాన్సువాడ పట్టణంలోని 14 వార్డులో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. పోచారం వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సీనియర్ నాయకులు ఉన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 44వ డివిజన్‌లో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల.. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

## బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

బాన్సువాడ, మే 5: బీఆర్‌ఎస్‌లో చేరికల జోరు కొనసాగుతున్నది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు గులాబీ పార్టీలో చేరుతున్నారు. తాజాగా వర్ని మండలం శంకోరా గ్రామ మాజీ ఎంపీటీసీ మంగ్యానాయక్‌తోపాటు పలువురు ఆదివారం మాజీ స్పీకర్ పోచారం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పోచారం గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరిన వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చి వంచన చేస్తున్నదని మండిపడ్డారు. అమలుకానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పోచారం నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండల బంజార నాయకుడు రంజ్యా నాయక్ , గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**జీవన్‌రెడ్డి సమక్షంలో..**

మాక్లూర్, ఏప్రిల్ 5: మండలంలోని మాదాపూర్ గ్రామంలోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరునెలల్లో కూలిపోతుందన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంకాపూర్‌లోని జీవన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శశి, బండి సురేశ్, వేణు, భూమేశ్, సాయిలు యాదవ్, సంపత్, సురేశ్ పాల్గొన్నారు.



జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

## ఆర్మూర్‌లో స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ఆర్మూర్‌టౌన్, మే 5: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణ కోసం చేపడుతున్న ఈవీఎంల కమీషనింగ్ (పనిచేసే తీరు) ప్రకియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, సంబంధిత అధికారులు ఉన్నారు.